ఆఖరి మజిలీకి అవస్థలు

- సుతారిగూడ మరుభూమి సమస్యతీరేదెన్నడూ...?
- ఏండ్లు గడుస్తున్నా దొరకని పరిష్కారం
- స్థలం లేక రోడ్డు పక్కనే దహనం చేయాల్సిన దుస్థితి

చెరువులో ఉన్న పాత స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు చెరువు నీటిలో నుంచి వెళ్తున్న స్థానికులు (ఫైల్)

చెరువులోపల ఉన్న అంత్యక్రియలు నిర్వహించే స్థలం

మేడ్చల్, జూలై17: ఆఖరి మజిలీకి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుతారిగూడలో స్థలం కరువై తల్లిడిల్లుతుంది. చెరువు లోపల ఉన్న పాత స్థలం అనువుగా లేక ఒక్కోసారి రోడ్డు పక్కన ఖననం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తొమ్మిదేండ్లుగా అంత్యక్రియల నిర్వహణలో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ చనిపోయిన ఇబ్బందులు తప్పడం లేదని సుతారిగూడ ప్రజలు కన్నీరు పెడుతున్నారు.

2018 తర్వాత...

దాదాపు 50 ఏండ్ల కిందట మేడ్చల్-గండిమైసమ్మదారి పక్కన సుతారిగూడ ఏర్పడింది. కాలక్రమేణా జనాభా పెరిగింది. వర్షాలు అంతంత మాత్రంగా ఉన్న సమయంలో మరుభూమి సమస్యకు సుతారిగూడ వాసులకు ఇబ్బందులు తలెత్తలేదు. సర్వే నంబరు 46లో 20.23 ఎకరాల విస్తీర్ణంలో సుతారిగూడ చెరువు విస్తరించి ఉంది. 2018 వరకు చెరువు నిండకపోవడంతో చెరువులో మేడ్చల్ పారిశ్రామిక వాడ నుంచి వస్తుండగా చెరువు ప్రారంభమయ్యే చోట అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే 2018 తర్వాత వర్షాలు జోరుగా కురవడంతో చెరువు నిండటం ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి ఏటా జోరుగా వానలు కురవడంతో చెరువు నిండి, అంత్యక్రియలు నిర్వహించే స్థలం మునిగిపోతుంది. ఇటీవల పై నుంచి అంటే కండ్లకోయ వైపు నుంచి శుద్ధి చేయని డ్రైనేజీ నీరు రావడంతో జోరు ఎండా కాలంలో సైతం అంత్యక్రియలు నిర్వహించే స్థలం తేలడం లేదు. అంతేగాకుండా చెరువు ఎఫ్‌టీఎల్ భూమి కూడా కొంత ఆక్రమణకు గురైనట్టు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

బౌట్‌లెట్ లేక ఇబ్బందులు

ప్రతి చెరువుకు తూములు, అలుగు పారేందుకు ఏర్పాట్లు ఉంటాయి. కానీ సుతారిగూడ చెరువుకు ఆ పరిస్థితి లేదు. ఎక్కడ తూము ఉందో, అలుగు పారే నీరు ఎలా వెళ్లేవో తెలియని పరిస్థితి ఉంది. కానీ తారు రోడ్డు పక్కన మాత్రం ప్రైవేట్ భూమి నుంచి వెళ్లేందుకు రెండు మార్గాలు మాత్రం ఉన్నాయి. కానీ వాటికి సరియైన ఆధారాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ప్రైవేట్ భూమిలో నుంచి నీటిని తాత్కాలికంగా బయటకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్వే నంబరు 25లో స్థలం కేటాయింపు

సుతారిగూడకు మరుభూమి స్థలం డిమాండ్ దృష్ట్యా సర్వే నంబరు 25లో ఉన్న 24 గుంటల భూమిని కేటాయించారు. సర్వే చూసి భూమిని అప్పగించిన తహసీల్దార్ శైలజ తెలిపారు. కాగా ఆ భూమిలో వైకుంఠధామం నిర్మించేందుకు రూ.20 లక్షలు మున్సిపాలిటీ నుంచి నిధులు మంజూరయ్యాయి. పనులను ప్రారంభించగా, పక్కనున్న భూ యజమానుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పనులను నిలిపివేసినట్టు డీఈ దుర్గా ప్రసాద్ తెలిపారు. అయితే ఆ స్థలం పక్కనే కొందరు రైతుల భూములు ఉండటంతో అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. అంతేగాకుండా కట్ట అభివృద్ధి, చెరువు నిండినప్పుడు నీళ్లు బయటికు వెళ్లేందుకు రూ. 35 లక్షలు మంజూరు చేస్తూ మున్సిపాలిటీలో తీర్మానం చేశారు. కానీ ఇంత వరకు టెండరు కాలేదు. అయితే గ్రామంలో ఇరువర్గాల మధ్య సఖ్యత లేకపోవడం కూడా సమస్య కొలిక్కి రావడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. స్థానికులు మాత్రం మరుభూమికి శాశ్వత పరిష్కారం చూసి, తమ బాధలు తీర్చాలని కోరుతున్నారు.

సర్వే నెంబరు 25లోకి వెళ్లేందుకు ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చేందుకు అంగీకరించిన దారి

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం:ఎమ్మెల్యే

మౌలాలి డివిజన్ సాదుల్లానగర్ సమస్యను స్థానికుల ద్వారా తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 17: ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్ సాదుల్లానగర్ డ్రైన్ ఔట్లెట్ లేనందున వస్తున్న సమస్యలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రియాజ్ ఉలుమ్ మదర్స దగ్గర పరిస్థితులను అధికారులతో సర్వే చేయించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రరమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, రాముయాదవ్, అమీనుద్దిన్, భాగ్యనందరావు, ఉస్మాన్, వంశీముదిరాజ్, శ్రీనివాస్, సంతోష్‌నాయుడు, ఇబ్రహీం, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

కీసరలో ఓ వీధిలో గుంపులుగుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

కీసర, జూలై 17: వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధి వీధిన రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువ కావడంతో జనంహడలిపోతున్నారు. గ్రామాల్లోని పలు వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తున్నారు. పలువురు ఆసుపత్రుల పాలైన ఘటనలు నెలకొన్నాయి. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు కుక్కల బెడద నుంచి కాడాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్,జూలై 17 : సీజనల్ వ్యాధులపై హబ్సిగూడ డివిజన్‌లోని పలు కాలనీల్లో బుధవారం కార్పొరేటర్ చేతన ఆధ్వర్యంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చేతన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందడం ద్వారా డెంగీ తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. చెత్త, మురుగు నిల్వ ఉండకుండా ప్రజలు ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ చందన,డీపీవో ఉమాదేవి, నరేశ్ రెడ్డి,ఎల్లాచారి ప్రవీణ్‌తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

నాగారం 5వ వార్డులో మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 17: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. 5వ వార్డులో వన మహోత్సంలో భాగంగా బుధవారం ఇంటింటికీ పండ్ల, పూల మొక్కలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్ లవణ్య, నాయకులు ఉన్నారు.

గణేశ్ మండప నిర్మాణానికి శంకుస్థాపన

చిట్టమ్మనగర్‌లో గణేశ్ మండపానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సబితాకిశోర్

మల్కాజిగిరి, జూలై 17: చిట్టమ్మనగర్‌లో గణేశ్ మండపం నిర్మాణ పనులకు వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితాకిశోర్ బుధవారం శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాలు, వినాయక చవితి పండుగలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కిశోర్, సుదర్శన్, బుద్దరెడ్డి, విజయశేఖర్, ప్రకాష్‌గౌడ్, జనార్దన్, సయ్యద్ మోసిన్, ఫైయాజ్, తాజుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్..ఒకరికి గాయాలు

శామీర్‌పేట, జూలై 17 : గ్యాస్ సిలిండర్ లీక్ అయి మంటలు అంటుకొని ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి ఈ సంఘటన మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకారం..ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన నారనికుమార్ కుటుంబ సభ్యులు తొలిఏకాదశి కావడంతో ఉదయాన్నే టీ,కాఫితో మొదలు పిండివంటలు చేసేంకు ఏర్పాట్లు చేసుకున్నారు. టీ పెట్టే క్రమంలో సిలిండర్ ఒక్కసారిగా లీకై మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేస్తూ బయటకు పరుగులు పెట్టారు. అప్పటికే కుమార్ కూతూరు పక్కకు తప్పుకునే ప్రయత్నం చేసినప్పటికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. వంటగదిలోని సామాగ్రి అగ్నికి ఆహుతైంది.

డంపింగ్ యార్డుతో రోగాల బారిన ప్రజలు

ఘట్‌కేసర్,జూలై17: పోచారం మున్సిపాలిటీ చెత్త డంపింగ్‌తో వచ్చే దుర్వాసనతో పరిసర కాలనీల ప్రజలు,ఔటర్ పై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా పోచారం మున్సిపాలిటీ నుంచి ప్రతిరోజు వెలువడే చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది అన్నోజిగూడలోని కంకర గుంతలో వేస్తున్నారు.దీంతో తీవ్రమైన దుర్వాసనతో సమీపంలోని లక్ష్మీనర్సింహకాలనీ,అన్నోజిగూడ,సంస్కృతి టౌన్‌షిప్ కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకొని ఔటర్ టోల్‌ప్లాజా వద్ద ఉన్న చెత్తడంపింగ్‌ను తొలగించాలని కోరుతున్నారు.

పోచారం మున్సిపాలిటీ ఓఆర్‌ఆర్ టోల్‌ప్లాజా సమీపంలో చెత్త డంపింగ్ ప్రాంతం.

వెల్లివిరిసిన మతసామరస్యం

- మొహర్రం వేడుకల్లో పాల్గొన్న హిందూముస్లింలు
- ఘనంగా పీర్ల ఊరేగింపు
- దట్టీలు కట్ట మొక్కు తీర్చుకున్న ప్రజలు
- పలు చోట్ల అన్నదానం..షర్బత్ పంపిణీ
- మౌలాలి దర్గాలో ఎమ్మెల్యే 'మర్రి' ప్రార్థనలు

మౌలాలి, ఉప్పరిగూడలో మొహర్రం సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మేడ్చల్ పట్టణంలో మొహర్రం పండుగలో పాల్గొన్న ముస్లింలు

కీసరలో పీర్లను దర్శించుకుంటున్న ప్రజలు

మల్కాజిగిరి, జూలై 17: మౌలాలిలో మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం మౌలాలి, ఉప్పరిగూడలోని దర్గాల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రార్థనలు నిర్వహించి పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, అమీనుద్దిన్, ఉస్మాన్, రాముయాదవ్, భాగ్యనందరావు, వంశీముదిరాజ్, సంతోష్‌నాయుడు, జోగు శ్రీనివాస్, అరుణ్‌గౌడ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

- **మేడ్చల్:** మేడ్చల్ పట్టణంలో ముస్లింలు మొహర్రం సందర్భంగా పీర్లను ఊరేగింపు నిర్వహించారు. శరబత్ పంపిణీ చేశారు. పీర్ల ఊరేగింపు కుల మతాలకు అతీతంగా జరిగింది. ముస్లింతో పాటు హిందువులు పాలుపంచుకున్నారు. ఇమామ్ ఈ ఖాసిం ఆశుర్ఖానా మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఖాజా ఖలీలుద్దీన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లాయక్ అలీ, రఫిక్, హుస్సేన్ ఖురేషి, బద్రుద్దీన్, ఖాజా మోహినొద్దీన్, ముక్తార్, మహ్మద్ జమాల్, అబ్రార్, కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ అలీ, కౌన్సిలర్ కౌడె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **కీసర:** కీసరలో మొహర్రం వేడుకలను నిర్వహించారు. కీసరలోని పీర్ల కొట్టంలో ముస్లింలు,హిందువులు పీర్లను కీసర దాయర, రాంపల్లిదాయరతో పాటు కీసరలోని పలు వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రజలు పీర్లకు దట్టీలను కట్టి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్త అన్నదానం చేశారు.
- **శామీర్‌పేట:** ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని గ్రామాలు, పట్టణాల్లో మొహర్రం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు హిందూ ముస్లింలు భక్తితో పీర్లను ఊరేగించగా ప్రజలు దట్టీలు, మిఠాయి, పూల చెద్దర్లతో ప్యాతాల్ ఇప్పిస్తు స్వాగతం పలికారు. ప్రత్యేక వంటకాలైన మలీదా, షర్బత్‌లను పంచిపెట్టారు.
- **మల్లాపూర్ :** మొహర్రంను పురస్కంచుకొని మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరనగర్‌కాలనీలో పీర్ల కొట్టం వద్ద ముస్లింలతో కలిసి కార్పొరేటర్ జె. ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **కాప్రా:** మొహర్రం సందర్భంగా ఓల్డ్‌కాప్రా, ఎల్లారెడ్డిగూడ, సాయిబాబానగర్, జమ్మిగడ్డ తదితర ప్రాంతాల్లో పీర్లను అలంకరించి డప్పు చప్పుళ్ల మధ్య కాలనీల్లో ఊరేగించారు. పీర్లకు భక్తులు వచ్చి సాకలు పోసి ఊదుబెల్లం, దట్టీలు, పూలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకుకున్నారు.

ఘనంగా లక్షపుష్పార్చన

రామంతాపూర్,జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా రామంతాపూర్ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి లక్ష పుష్పార్చన ఘనంగా జరిగింది. వందలాదిమంది భక్తుల మధ్య విష్ణు సహస్రనామ పారాయణం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ధర్మకర్త కోట్ల నర్సింహారెడ్డి , ఆలయ అర్చకులు, స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వరుడికి వెండి ఆభరణాలు సమర్పణ

వెండి ఆభరణాలు సమర్పిస్తున్న దాత విజయభాస్కర్ సుజాత దంపతులు

శామీర్‌పేట, జూలై 17 : వెంకటేశ్వరుడికి వెండి ఆభరణాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు ఓ దంపతులు. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని అక్కన్నమాదన్న కాలం నాటి శ్రీవిష్ణు శివాలయాన్ని బుధవారం తుర్కపల్లి పారిశ్రామిక వాడలోని ఓ ఫార్మా కంపెనీకి చెందిన విజయభాస్కర్ సుజాత దంపతులు దర్శించుకున్నారు. రూ.1 లక్ష విలువ చేసే వెండి చెమ్మలు, రెండు దీపాలు, వెంకటేశ్వర స్వామి ప్రతిమ (వెండి ఆభరణాలను) సమర్పించారు. దీంతో ఆలయ కమిటీ చైర్‌పర్సంన్ ఆడెపు ఉమామహేశ్వరీ, డైరెక్టర్లు, ప్రధానార్చకులు తీగుళ్ళ మాధవశర్మ వేద మంత్రలతో స్వామివారి ఆశీస్సులను అందజేశారు.

బోడుప్పల్ మేయర్‌గా అజయ్‌యాదవ్ బాధ్యతల స్వీకరణ

బోడుప్పల్, జూలై17: బోడుప్పల్ నగర మేయర్‌గా తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 15న జరిగిన ఎన్నికలో ప్రొసిడింగ్ ఆఫీసర్ వెంకటఉపేందర్ నుంచి మేయర్‌గా నియామక పత్రం అందుకున్న అజయ్‌యాదవ్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు స్వీకరించిన వెంటనే బోడుప్పల్ పరిధిలో టైబజార్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో చిరువ్యాపారస్తులు ఆనందం వ్యక్తంచేస్తూ మేయర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్, జులై 17 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు మేడ్చల్ పట్టణ ఏఈ శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం విధించనున్నామన్నారు. కిష్టాపూర్, అర్చన, వీకర్‌సెక్షన్ కాలనీ, కిష్టాపూర్ క్వార్టర్స్ ప్రాంతాల్లోని గృహ, వ్యవసాయ కనెక్షన్లకు కోత అమలవుతుందని పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం



విశ్వతేజ(ఫైల్)

నేరేడ్‌మెట్, జూలై 17: విద్యార్థి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై చంద్ర శేఖర్ కథనం ప్రకారం.. వినాయకనగర్ సుమంగళి ఫంక్షన్‌హాల్ సమీపంలో కృష్ణవేణి తనయుడు కంకనల విశ్వతేజ (19) నివాసం ఉంటున్నాడు. స్థానిక భవన్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16న తన మిత్రుడి ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఈ రోజువరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో బుధవారం కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయ మరమ్మతు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్,జూలై17: పోచారం మున్సిపాలిటీ 12వ వార్డు సంస్కృతి టౌన్‌షిప్‌లోని శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ మరమ్మతు పనులను వార్డు కౌన్సిలర్ బి.హరిప్రసాద్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త,కార్యదర్శి కె.నవీన్, సభ్యులు బుధవారం ప్రారంభించారు. దాతల సహకారంతో దాదాపు రూ.35లక్షలతో ఈ అభివృద్ధి పనులనునిర్వహించనున్నట్లు ప్రతినిధులుతెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నేరేడ్‌మెట్, జూలై 17: సమిష్టి కృషితోనే కాలనీ సమస్యలు పరిష్కరించవచ్చని కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ భర్త బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్ అన్నారు. బుధవారం గౌతంనగర్ డివిజన్ వాణినగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి నంబర్ల సూచికల బోర్డులను కాలనీ సంక్షేమ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

శ్రీవారికి గరుడ కవచం

శ్రీవారికి గరుడ కవచాన్ని సమర్పిస్తున్న వెంకట సుబ్రహ్మణ్యం

నేరేడ్‌మెట్, జూలై 17: శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని గరుడ అళ్వార్‌కు మల్కాజిగిరి వసంతపురి కాలనీకి చెందిన వెంకట సుబ్రమణ్యం 3కిలోల900 గ్రాముల గరుడ కవచాన్ని సమర్పించారు. బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయకార్యనిర్వహణ అధికారి రవీంద్ర రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులకు గరుడ కవచాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వెండి కవచాన్ని గరుడ అళ్వార్ వారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తునికి స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో దేవాలయ అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నేరేడ్‌మెట్, జూలై 17: సమష్టి కృషితోనే కాలనీ సమస్యలు పరిష్కరించవచ్చని కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ భర్త బీఆర్ఎస్ నాయకుడు రాముయాదవ్ అన్నారు. బుధవారం గౌతంనగర్ డివిజన్ వాణినగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి నంబర్ల సూచికల బోర్డులను కాలనీ సంక్షేమ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కాప్రా, జూలై 17: ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సైదయ్య, రామలక్ష్మణ్ రాజ్ సూచించారు. బుధవారం ఈసీఐఎల్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగిచారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్,ఏఎస్ఐ నర్సింహులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఏసీపీ పరిశీలన

మేడ్చల్, జూలై 17: మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారిపై జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా బుధవారం ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయ్యే వరకు ఫ్లై ఓవోర్ పక్కన ఉన్న రోడ్డు వినియోగించే వాహనదారులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు. ఏసీపీ వెంట ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



క్యాంప్ కార్యాయలంలో సీఎంఆర్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 17: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌కు చెందిన వారికి సీఎంఆర్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్ద ఆరోగ్య సేవలు అందించడానికి బస్తీ దవఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మల్కాజిగిరిలో ఏరియా దవఖానలు సేవలందిస్తున్నాయని అన్నారు. దుండిగల్‌లోని అరుంధతి దవఖానలో ఉచితంగా గుండే ఆపరేషన్‌లతో పాటు ఇతర వైద్య సేవలు అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంజయ్య, రాముయాదవ్, భాగ్యనందరారు, వంశీముదిరాజ్, సత్తయ్య, కాశీయాదవ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేదారీనాథ్ ఆలయ నిర్మాణ భూమిపూజ

మేడ్చల్ రూరల్, జూలై 17: మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామ శివారులో కేదారీనాథ్ మందిర నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఉత్తర భారతీయులు సుమారు 3 వేల చదరపు గజాల్లో ఈ మందిరాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, నావారనాసి పీఠాధిపతి శంకరాచార్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు,ఆలయ నిర్మాణ దాతలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంతో రవ్వ తయారీ.. ఒకరి అరెస్టు

మల్కాజిగిరి, జూలై 17: గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యంతో రవ్వ తయారు చేస్తున్న వ్యాపారిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. వెంకటేశ్వరనగర్ నివాసి చీమకోటి శ్రీనివాస్ (45) కొంత కాలంగా శ్రీసాయి ఎంటర్ ప్రైజెస్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. గత కొన్ని నెలలుగా రేషన్ బియ్యం తీసుకొచ్చి నకిలీ రవ్వను తయారు చేసి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ దుకాణంపై దాడిచేసి నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం, బియ్యం బస్తాలు, రవ్వ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడైన శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.